గాలివాన బీభత్సం



నేలరాలిన బీరతోట

చెల్దిగానిపల్లెలో పంట నష్టం



చెల్దిగానిపల్లె వద్ద నర్సరీపై పడ్డ వడగండ్లు

రామకుప్పం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం పెను గాలులు, వడగండ్లతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. సుమారు 150 ఎకరాలకు పైగా ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. గాలుల తాకిడికి బీన్స్, బీర, స్వీట్‌కార్న్, టమోటా తోటలు నేలవాలాయి. 50 ఎకరాల్లో దానిమ్మ తోటలు దెబ్బతిన్నాయి. ఓ కోళ్ళ ఫారం పై కొబ్బరి చెట్టు పడడంతో షెడ్డు పైభాగం పూర్తిగా దెబ్బతిని కోళ్ళపై షీట్లు విరిగిపడ్డాయి. దీంతో వందలాది కోళ్ళు మృత్యువాత పడ్డాయి.శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి వాతావరణాన్ని చల్లబరిచింది.





కోళ్ళ ఫారం పై పడ్డ కొబ్బరి చెట్టు, మృతి చెందిన కోళ్ళు

రూ.లక్షల్లో పంట నష్టం

సోమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం రైతులకు కన్నీరు మిగిల్చింది. శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి సోమల, నెల్లిమంద, తమ్మినాయనపల్లె, కందూరు గ్రామాల్లో వడగండ్ల వాన పడడంతో వందల ఎకరాల్లో మామిడి, టమోటా, వరి, దోస, బొప్పాయి పంటలకు నష్టం జరిగింది. అరకొరగా మామిడి తోటల్లో కాసిన కాయలు కూడా నేల రాలాయి. మామిడి, టమోటా తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి ధాన్యం గింజలు రాలిపోయాయి.టమోటా తోటల్లో వడగండ్ల వానతో రూ.లక్షల్లో పంట నష్టం జరిగింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది రాత్రి 8గంటలకు సరఫరాను పునరుద్ధరించగలిగారు.



నేల రాలిన మామిడి

నేలకూలిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సానికి పుంగనూరు మండలంలోని పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. శుక్రవారం సాయంత్రం ఈడిగపల్లె - చెంబకూరు మార్గంలో వీచిన గాలికి వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. వ్యవసాయ బోర్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కిందపడ్డాయి. ఈడిగపల్లె, అరంట్లపల్లె, బోడేవారిపల్లె, షికారిపాళ్యం, ఎర్రగుట్లపల్లె ప్రాంతాల్లో అల్లనేరేడు, వేప, కానుగ, మామిడి చెట్లు, 6 విద్యుత్ స్తంభాలు, 4ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి.నేతిగుట్లపల్లె సమీపంలోని ఒంటిల్లులో వెంకట్రమణ ఇంటిపైకప్పు రేకులు గాలికి ఎగిరి పడి అతడి భార్య కమలమ్మ, కుమారుడు పూర్ణకుమార్ గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి వారిని తరలించారు. పూత, కాయలు వస్తున్న అల్లనేరేడు చెట్లు గాలికి విరిగిపోయాయి. దాదాపు 30 ఎకరాల్లో టమోటా సాగుకు ఏర్పాటు చేసిన కట్టెలు నేల కూలి టమోటా తోటలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు.



అరంట్లపల్లె వద్ద టమోటా మొక్కలకు కట్టిన కర్రలు ధ్వంసం



ఎర్రగుంట్లపల్లె వద్ద నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్






గాయపడ్డ పూర్ణకుమార్, ఒంటిల్లులో లేచి పోయిన ఇంటి పైకప్పు

కొనసాగిన ఉక్కపోత

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎండతీవ్రత, ఉక్కపోత శుక్రవారం కూడా కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో శనివారం వడగాడ్పులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. శుక్రవారం అత్యధికంగా తవణంపల్లెలో 39.5, అత్యల్పంగా రామకుప్పంలో 33.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయ్యింది.శ్రీరంగరాజపురంలో 39, పులిచెర్ల, యాదమరి, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 38.8, చిత్తూరు, గుడిపాల మండలాల్లో 38.7, బంగారుపాళ్యంలో 38, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో 37.8, సదుంలో 37.6, గంగాధరనెల్లూరులో 37.5, పెనుమూరు, పాలసముద్రం, నింద్ర, నగరి, కార్వేటినగరం, ఐరాల, చౌడేపల్లె, విజయపురం మండలాల్లో 37, రొంపిచెర్లలో 36.8, సోమలలో 36.6, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 35.4, పలమనేరులో 35, పుంగనూరు, వి.కోట మండలాల్లో 34.7, కుప్పంలో 34.2, బైరెడ్డిపల్లిలో 34 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మా బాబు బంగారం



రేపు నారా చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు

ఆయన తండ్రి నాయకుడు కాదు. ఆ కుటుంబానికీ రాజకీయ నేపథ్యం లేదు. కూడబెట్టి పేర్చిన కోట్ల సంపదా లేదు. అయినా.. అతను నాయకుడయ్యాడు. అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యాడు. ఏపీ అభివృద్ధికి తనే ఒక సంకేతంలా మారాడు. ఇదంతా రాత్రికి రాత్రి జరిగిన మాయ కాదు. ఒక సాధారణ రైతుబిడ్డ దేశ రాజకీయాల్లోనే కీలక భూమిక పోషించే స్థాయికి చేరుకోవడం వెనుక చాలా ఉంది. చంద్రగిరి బడి నుంచి ఎస్వీ యూనివర్శిటీ పీహెచ్‌డీ పరిశోధన దాకా సాగిన ప్రయాణం ఉంది. ఈ ప్రయాణంలో అల్లరి ఆటలూ, ఎన్నికలూ పోరాటాలూ, కులాలూ సవాళ్లూ మానవీయ స్పందనలూ ఉన్నాయి. బడిలో, కాలేజీలో, యూనివర్శిటీలో, కుటుంబంలో నారా చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితంగా ఉన్నవారి మాటల్లోంచి ఏరుకున్న విశేషాలు ఇవి.. కుప్పం ఆరాధ్య నాయకుడు, నారావారిపల్లె ముద్దుబిడ్డ రేపు 75వ పుట్టినరోజు జరుపుకోబోతున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేకం...

- 6వ పేజీలో

విస్తృతంగా వాహనాల తనిఖీలు




చిత్తూరు మురకంబట్టు జంక్షన్‌లో వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి తొమ్మిది నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. చిత్తూరు మురకంబట్టు జంక్షన్‌లో ఎస్పీ మణికంఠ స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టడానికి, మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించడానికి, నిర్లక్ష్యంగా, వేగంగా వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

75 కేసుల నమోదు

జిల్లావ్యాప్తంగా 4,275 వాహనాలను తనిఖీ చేయగా.. మోటార్ వెహికల్ చట్టం కింద 75 కేసులు నమోదు చేసి రూ.43,760 జరిమానా విధించారు. రెడ్డిగుంట చెక్‌పోస్టు వద్ద పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాల్లేని నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, ఒకలారీని సీజ్ చేశారు. 27 మందిపై డ్రంకెన్ డ్రైవ్, ముగ్గురిపై ఓపెన్ డ్రింకింగ్ కేసు, ఓ మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. బంగారుపాళ్యం పోలీసుస్టేషన్ పరిధిలో 20 మద్యం బాటిళ్లను, వి.కోట పరిధిలో 96 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.



మా గ్యాంగ్‌లీడర్

చిత్తూరు,ఆంధ్రజ్యోతి


తవణంపల్లె మండలం జి.గొల్లపల్లెకు చెందిన మధుసూదనరావు పీయూసీలో చంద్రబాబుతో కలిసి చదువుకున్నారు. చంద్రబాబుతో కలిసి యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. పీపీగా పనిచేసి రిటైరయ్యారు. ఈయన ఒకనాటి జ్ఞాపకాలు..



మధుసూదనరావు

బీసీ స్నేహితుడ్ని లీడర్ చేశారు

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 1968-69లో నేను, చంద్రబాబు కలిసి చదువుకున్నాం. నేను ఇంటర్ ఫెయిల్ కావడంతో ఆయనతో పాటు కలిసి డిగ్రీకి వెళ్లలేకపోయాను. డిగ్రీలో మా అన్న పద్మనాభ నాయుడు ఆయనతో కలిసి చదువుకున్నాడు. చంద్రబాబు, మా అన్న, మదనపల్లెకు చెందిన కోటేశ్వరరావు (రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు మేనేజరు).. ముగ్గురూ కలిసి ఎ బ్లాక్‌లోని రూమ్ నెంబర్ 26లో ఉండేవారు. యూనివర్శిటీలో నాన్ రెడ్డి స్టూడెంట్స్‌కు చంద్రబాబు నాయకత్వం వహించారు. అప్పట్లోనే సమానత్వం పేరుతో బీసీ స్నేహితుడిని విద్యార్థి సంఘ ఛైర్మన్ చేశారు. ఆర్థికంగా మరీ ఎక్కువ స్థాయిలో లేకున్నా మా గ్యాంగులో ఆయనే లీడర్. బయటికి ఎక్కడికెళ్లినా చుట్టూ పదిమంది ఉండేవారు. మా భుజాలపై చేతులేసి మాట్లాడేవారు.జల్లికట్టు పోటీలకు ఉత్సాహంగా వచ్చేవారు. తనూ తలపడేవారు. ఒకసారి గాయపడ్డారు కూడా.



మీసం మెలేస్తున్న చంద్రబాబు

150 బైక్‌లతో ర్యాలీ


అప్పటి చంద్రగిరి నియోజకవర్గంలోని పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా ఆయన రాజకీయ ఆరంగేట్రం జరిగింది. ఇందిరా గాంధీ తిరుపతి పర్యటనలో సుమారు 150 బైక్‌లతో ర్యాలీ చేసి ఆమె దృష్టిలో పడ్డారు. రాజగోపాల నాయుడి ప్రోత్సాహంతో 1978 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు.

నాకోసం ఢిల్లీ వచ్చారు

'మీ అన్నదమ్ముల్లో ఒకరు రాజకీయాల్లోకి రండి' అంటూ చంద్రబాబు పిలిస్తే నేను వెళ్లా. యూత్ కాంగ్రెస్‌లో చంద్రబాబు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నేను జిల్లా అధ్యక్షుడిగా పనిచేశాం. 1983 ఎన్నికల్లో నాకు చిత్తూరు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించేందుకు ఢిల్లీకి కూడా వచ్చారు. పుత్తూరు నుంచి టికెట్ ఇవ్వడంతో నేను పోటీ చేయలేదు. అప్పటి టీడీపీ గాలిలో అందరూ ఓడిపోయారు. చంద్రబాబుతో పాటు నేనూ టీడీపీలో చేరా. ఇక రాజకీయాలు చేయలేను, లా చదివిన నాకు ఏదైనా ఉద్యోగం ఇప్పించమని చంద్రబాబును కోరా. అలా ఆయన వల్ల 1986 నుంచి 2011 వరకు పీపీగా పనిచేసి రిటైరయ్యా. ఇప్పుడు వ్యవసాయం చేసుకుంటున్నా.



స్నేహితులతో కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో బాబు



చంద్రబాబు ఎస్వీయూనివర్సిటీలో పీజీ చదివేటప్పుడు కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు ఆయనకు సహచరుడు. ఒకే బెంచ్, ఒకే గదిలో ఉండేవారు. చంద్రబాబును దగ్గరగా యూనివర్శిటీలో పరిశీలించిన స్నేహితుడు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు సభ్యుడిగా చేసిన ఆచార్య కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు తన దోస్తు గురించి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న యూనివర్శిటీ సంగతులు..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పదిమందిని నడిపించేవాడు

చంద్రబాబు పీజీ సహచరుడు కొమ్మినేని శ్రీనివాసులు నాయుడు



వెంట జనం ఉండాలి

1972-73లో బాబు మొదటి సంవత్సరం ఎంఏ (ఎకనామిక్స్) చదివినప్పుడు చాలా తక్కువమంది ఉత్తీర్ణులు అయ్యారు. అందులో బాబు ఒకరు. ఆయన పట్టుదల, కృషికి ఇది ఒక చిన్న తార్కాణం. ఏ పని చేయాలన్నా, ఎక్కడికి వెళ్లాలన్నా నలుగురిని కూడగట్టుకొని ముందుకుసాగేవాడు. 1973-74లో బాబు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ స్టూడెంట్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. డిపార్ట్మెంట్లోనూ, కళాశాలలోనూ నిర్వహించే అన్ని కార్యక్రమాలనూ ప్రణాళికాబద్ధంగా అందరినీ కలుపుకుని నిర్వహించేవారు. డిపార్ట్మెంట్ ఛైర్మన్‌గా ఉంటూనే వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమల సందర్శనకు, విహార యాత్రలకు నాయకత్వం వహించి తీసుకెళ్లేవారు.

సిబ్బందికీ ఆర్థిక సాయం

యూనివర్శిటీలో హాస్టల్, మెస్ ప్రతినిధులను ఎక్కువ మందిని తన ప్యానల్లోని వారినే గెలిపించుకుని అత్యధిక మెజారిటీతో హాస్టల్, మెస్ జనరల్ సెక్రటరీగా బాబు ఎన్నికయ్యాడు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థులను ఆస్పత్రులకు తీసుకెళ్లేవాడు. ఎంతోమంది నాలుగోతరగతి సిబ్బందికి ఆర్థిక సహాయం అందించేవాడు.

పేద విద్యార్థులకు ఫీజులు కట్టేవాడు

కొందరు విద్యార్థులు సకాలంలో ఫీజులు చెల్లించలేకపోతే తానే ఫీజులు చెల్లించేవాడు. ఎక్కువ మందికి ఫీజులు చెల్లించవలసి వస్తే, తన మిత్రులను ఒప్పించి వారి దగ్గర నుండి పేద విద్యార్థుల ఫీజులు కట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. న్యాయం కోసం పోరాడే మనస్తత్వం చంద్రబాబుది. ఉపకారవేతనాలు సకాలంలో అందకపోతే తనే ముందుండి సోషల్ వెల్ఫేర్ ఆఫీసుకు వెళ్ళి అక్కడి అధికారులతో చర్చలు జరిపి సకాలంలో ఉపకార వేతనం అందేటట్టు చేసేవాడు.

నడిపించే శక్తి

తాను ఎదగడమే గాక, తనలాగే సహచరులను తయారు చేయడమనేది సమర్థుడైన నాయకుని లక్ష్యం.ఆ కోవకు చెందిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. గీతానాథ్ అనే బీసీ విద్యార్థిని విశ్వవిద్యాలయ విద్యార్థిసంఘం అధ్యక్షుడి గానూ, మోహన్ అనే కాపు నాయకుడిని కార్యదర్శిగానూ ముందుండి గెలిపించాడు. తరువాతి కాలంలో గీతానాథ్ అకడమిక్‌గా, మంచి అడ్మినిస్ట్రేటర్‌గా ఎదిగాడు. మోహన్ తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశాడు.

పీహెచ్‌డీ చేస్తుండగానే రాజకీయాల్లోకి

ప్రొఫెసర్ డీఎల్ నారాయణ నేతృత్వంలో పీహెచ్‌డీ చేస్తుండగానే 1976లో చంద్రబాబు రాజకీయ రంగప్రవేశం చేశాడు. పులిచెర్ల సమితికి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు.

- విభిన్న సామాజిక వర్గాలకు చెందిన వారు ఆయన స్నేహితులుగా ఉండేవారు. తొండవాడ గిరిధర్ రెడ్డి, రంగంపేట సుబ్బరామిరెడ్డి, విక్టర్, పీఎస్ మునిరత్నం, షరీఫ్, కరీం వంటివారు ఆయనకు దగ్గరగా ఉండేవారు.
- చదువుకునే రోజుల్లోనే చంద్రబాబు చుట్టుపక్కల గ్రామాలలో సమస్యలను ఓర్పుగా, నేర్పుగా పరిష్కరించి పోలీసు స్టేషన్లకు, కోర్టులకు వెళ్ళకుండా రాజీ చేసేవాడు.
- 1977నవంబరు19న దివిసీమను ఉప్పెన మింగేసింది. అప్పుడు చంద్రబాబు తన మిత్రులను కూడగట్టుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించి నగదుతో పాటు, ధాన్యాన్ని, వస్త్రాలను సేకరించి నేరుగా దివిసీమకు వెళ్ళి అందజేశాడు.
- యువత దగ్గర 'వరకట్న నిషేధిత ప్రతిజ్ఞ' పత్రాలను సేకరించి వాటిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు సమర్పించి అభినందనలను పొందాడు.
- ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజలను సంఘటితం చేసి శ్రమదానంతో రహదారులను నిర్మించి, నీటికాలువలను ఏర్పరచి చెరువులకు నీటిని మళ్ళింపజేసిన ఘనత ఆయనది.

చదువులో యావరేజ్.. ఆలోచనలు ఇంటెలిజెంట్


- చంద్రబాబు టీచర్ మునిరత్నం నాయుడు
- బాబు ఆర్థిక సంస్కరణలకు బీజం పీజీలోనే!

చంద్రబాబుకు ఎంఏలో గురువు ప్రొఫెసర్ కె.మునిరత్నం నాయుడు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1972-74లో చంద్రబాబు ఎంఏ ఎకనామిక్స్ చేశారు. రీసెర్చ్‌స్కాలర్‌గా ఉంటూ ఇండస్ట్రియల్ ఎకనమిక్స్‌ను ఈయన బోధించేవారు. 2014లో మునిరత్నం నాయుడు ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా కూడా చేశారు. పీజీ విద్యార్థిగా చంద్రబాబు వ్యక్తిత్వ వికాసాన్ని 'ఆంధ్రజ్యోతి'తో ఇలా పంచుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పీహెచ్‌డీ గైడ్‌తో చర్చలు

చదువులో ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ కాకపోయినా, అతని ఆలోచనలు చాలా ఇంటలిజెంట్‌గా ఉండేవి. పీజీ తర్వాత ప్రొఫెసర్ డీఎల్ నారాయణ మార్గదర్శకత్వంలో చంద్రబాబు పీహెచ్‌డీలో చేరారు. డీఎల్‌తో గంటలకు గంటలు చర్చలు చేసేవాడు. నేను వారిద్దరి సంభాషణ వింటుండేవాడిని. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ ఆ సమయంలో ఎస్వీయూలో పనిచేశారు. ఆయనతోనూ చంద్రబాబు సన్నిహితంగా ఉండేవారు. సీఎంగా చంద్రబాబు దార్శనికత లోకానికి తెలుసు. దానికి బీజం విద్యార్థి దశ నుంచే పడిందని నాకు అనిపిస్తుంది. నాయకత్వ లక్షణాలు, అభివృద్ధి అవకాశాల గురించిన ఆలోచనలు ఆయన అప్పట్లోనే అందరితో మాట్లాడేవాడు.



ఒబీడియంట్ స్టూడెంట్

చంద్రబాబు క్రమం తప్పకుండా క్లాస్‌కు హాజరయ్యేవారు. చాలా ఒబీడియంట్ స్టూడెంట్. ఎవరైనా తోకతిప్పుతున్నారని వైస్ ఛాన్సలర్ దృష్టికి వెళితే టీసీ ఇచ్చి ఇంటికి పంపించేవారు. అయితే చంద్రబాబు పక్కన నలుగురైదుగురు ఫ్రెండ్స్ ఎప్పుడూ ఉండేవారు. విద్యార్థి సంఘ నాయకుడిగా చురుగ్గా ఉండేవాడు.

ఎన్జీ రంగాపై పరిశోధన

పీజీ పూర్తవ్వగానే "వ్యవసాయ రంగం అభివృద్ధి-ఎన్జీ రంగా కృషి' అంశంపై చంద్రబాబు పరిశోధక విద్యార్థిగా మారారు. కొంత డేటా నేను కూడా ఇచ్చా. పరిశోధన పూర్తి చేశారు. కానీ సబ్మిట్ చేయలేకపోయారు. నేను హెల్ప్ చేస్తానంటే వద్దన్నారు. అప్పటికే రాజకీయాల్లో బిజీ అయిపోవడం వలన దానిని పక్కన పెట్టేశారు.

కందులవారిపల్లికి చెందిన కొత్తపల్లి దేవరాజులు నాయుడు చంద్రబాబుకు సన్నిహిత బంధువు, మిత్రుడు. శేషాపురంలో ప్రైమరీ, చంద్రగిరిలో హైస్కూలు వరకూ ఇద్దరూ కలిసే చదువుకున్నారు. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో కలసి డిగ్రీ చదివారు. అక్కడే హాస్టల్ రూములో కలసి వున్నారు. హాస్టల్ నుంచీ బయట వచ్చేశాక కూడా తిరుపతిలో విడిగా రూము తీసుకుని ఇద్దరూ వున్నారు. చంద్రబాబు తొలి ఎన్నికల్లోనూ వెంట వుండి పనిచేశారు. అగ్నిమాపక శాఖలో ఉద్యోగం చేసి రిటైరయ్యాక ప్రస్తుతం కందులవారిపల్లిలోనే నివాసం వుంటున్నారు. చంద్రబాబుతో ఆయన జ్ఞాపకాలు.....

టెన్త్ ఫెయిల్

చంద్రగిరిలో ఇంగ్లీషు మీడియం చదవడం కష్టమై చంద్రబాబు టెన్త్‌లో ఫెయిలయ్యాడు. తిరుపతిలో టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ హైస్కూల్లో తెలుగు మీడియంలో మళ్ళీ టెన్త్‌లో చేరాడు. దాంతో నాకంటే ఒక సంవత్సరం జూనియర్ అయ్యాడు. నేను తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ చదువుతుంటే చంద్రబాబు అక్కడే పీయూసీలో చేరాడు. మేమిద్దరం, చిత్తూరు అరగొండ సమీపంలోని పద్మనాభం నాయుడు.. ముగ్గురం ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ హాస్టల్ రూమ్ నంబరు 102లో వుండేవాళ్ళం. ఆ రూమ్‌లో మా గోల భరించలేక హాస్టల్ వార్డెన్ రాజు సార్ రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపొమ్మని ఆర్డరేశాడు. దాంతో రూమ్ ఖాళీ చేసి పొర్ల వీధిలో సొంతంగా రూము అద్దెకు తీసుకుని అక్కడే చదువుకున్నాం.

తొలి ఓటమి

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదివేటపుడు బీఏ హెచ్ఈపీ గ్రూపు తీసుకున్నాడు చంద్రబాబు. సెకండియర్‌లో వుండగా ఫైన్ ఆర్ట్స్ సెక్రటరీగా పోటీ చేశాడు. ప్రత్యర్థి ఫైనలియర్ స్టూడెంట్ దీనదయాళ్. అయితే పోటీ చేసినాక ప్రచారం చేయకుండా గమ్మున వుండిపోయినాడు. దాంతో ఆ ఎలక్షన్‌లో ఓడిపోయినాడు.



చంద్రబాబు తొలిఎన్నికల కౌంటింగ్ రోజు జ్ఞాపకాలు ఇవి. రాజకీయ నేపథ్యం లేదు. పేరు ప్రఖ్యాతులు లేవు. ఉరకలెత్తే ఉత్సాహం.. అండగా నిలబడే స్నేహితులు తప్ప. ఇల్లిల్లూ తిరిగి ఓట్లడిగాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో స్వల్ప ఆధిక్యంతో అయినా.. విజయం సాధించాడు. చంద్రగిరి అసెంబ్లీ ఎన్నికల్లో అదో చరిత్ర. ఆనాటి జ్ఞాపకాలను ఇద్దరు సన్నిహితులు ఇలా పంచుకుంటున్నారు...

తొలి గెలుపు.. రెండు జ్ఞాపకాలు

ఆ రేత్రి కంటిమింద కునుకులేదు

"మా సొంత చిన్నాయన కొడుకు చంద్రబాబు నాకంటే మూడేండ్లు చిన్నోడు. నన్ను చంద్రబాబు పెద్ద మేనమామ కనుమూరి దొరస్వామి నాయుడుకు ఇచ్చి చేసినారు. అన్నలదమ్ముల బిడ్డలం కదా అందరం కలిసే పెరిగినాము. చంద్రబాబు తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు మాది మామూలు రైతు కుటుంబం. ఆ పక్కన నిలబడింది చానా పెద్దోళ్ళు. పల్లిలో మగోళ్ళంతా చంద్రగిరికి కౌంటింగ్ కాడికి పోయినారు. ఊర్లో ఆడోళ్ళం వుండాము. రాత్రి 7.30 గంటలకు ఓట్లు లెక్క పెట్టేది అయిపోయింది. చంద్రబాబు గెలిచినాడని మాకు రాత్రి 8 గంటలకు తెలిసింది. మేము ఆ దినం బెల్లం గానుగ ఆడతా వుండాము. మూడు పెనాలు దించినాము. నాలుగో పెనం దించకుండానే వదిలేసి చెరకు తోటలో నుంచీ పల్లిలోకి పరిగెత్తుకుంటా వచ్చినాము. ఎవురి నోట్లో విన్నా మావోడు ఎమ్మెల్యేగా గెలిచిపోయినాడబ్బా.. అనే మాటే. అంత రాత్తిరిలో పూలు పెరక్కచ్చే దానికి పరిగెత్తినాము. గెలిచినాక చంద్రబాబు చంద్రగిరి నుంచీ అట్నే కొండకు పోయి దేవునికి దండం పెట్టుకోని మళ్ళా చంద్రగిరికి వచ్చినాడు. రాత్రంతా ఆడ ఊరేగింపు జరిగింది. మరుసటి రోజు తెల్లారి ఇంటికొచ్చినాడు. గెలిచినాడని తెలిసినాక పల్లిలో అందరికీ ఒకటే సంబరం. రాత్రంతా ఎవురికీ కంటి మింద కునుకు లేదు. మరసటి రోజు చంద్రబాబు జీపులో ఊర్లోకి రాగానే అందరం పూలు జల్లినాము. ఆ సంబరం, సంతోషం చెప్పలేము."

- కనుమూరి శిద్ధమ్మ
(చంద్రబాబు పెద్దనాన్న కుమార్తె), నారావారిపల్లి






గెలిచినావు అని చెప్పినా నమ్మలేదు!

"1978లో తొలిసారి చంద్రబాబు ఎమ్మెల్యేగా పోటీ చేసినాడు. చంద్రగిరిలో కౌంటింగ్ జరగతా వుంది. జనతా పార్టీ క్యాండిడేట్ కొటాల పట్టాభి చౌదరి అప్పటికే బలమైన నాయకుడు. చంద్రగిరిలో కరణం చెంచుముని పిళ్ళై ఇంటి మిద్దె మీద రూమ్‌లో కౌంటింగ్ రోజు అందరం మకాం వేసినాము. ఒకో రౌండు అయిపోతావుంది. అన్ని రౌండ్లలో కొటాల పట్టాభి చౌదరికే మెజారిటీ వస్తావుంది. లాస్టుకు రెండు రౌండ్లు మిగిలినాయి. అప్పటికి చౌదరికి ఆరు వేలకు పైన మెజారిటీ వుంది. దాంతో ఇంగ గెలిచేది లేదని చంద్రబాబు నీరసపడిపోయినాడు. అట్నే రూములో పడుకునేసినాడు. పట్టాభి చౌదరి గెలిచేసినాడని అప్పటికే రెండు సార్లు వాళ్ళ మనుషులు టపాసులు కాల్చి జిందాబాద్‌లు కొడతా వుండారు. ఇంగోపక్క లారీలో మేకపోతులు, పొట్టేళ్ళు ఏసుకుని ఇంకొందరు తలకోనకు బయల్దేరి పోయినారు డిన్నరు పెట్టుకునే దానికి. మేమంతా డీలా పడిపోయి గమ్మున కూర్చుని వుండాం. లాస్టు రెండు రౌండ్లలో పట్టాభి చౌదరిని దాటి చంద్రబాబుకు మెజారిటీ వచ్చేసింది. 1250 ఓట్ల మెజారిటీతో చంద్రబాబు గెలిచినాడని చంద్రగిరి తాసిల్దారు నారాయణరావు అనౌన్స్‌మెంట్ ఇచ్చినాడు. పడుకోని వున్న చంద్రబాబును లేపి నువ్వు ఎమ్మెల్యేగా గెలిచినావు అంటే మొదుట నమ్మనే లేదు. యూత్ అంతా చంద్రబాబును భుజాల మీద ఎత్తుకోని రూము కాడ నుంచి తాసిల్దారు ఆఫీసు వరకూ ఊరేగింపుగా తీసకపోయినారు.

- కొత్తపల్లి దేవరాజులు నాయుడు,
కందులవారి పల్లె, చంద్రబాబు రూమ్మేట్



రాజులాయన జాతకం నిజమైంది

1968లో చంద్రబాబు ఎస్ఎస్ఎల్‌సీ. ఆ రోజు మా రిజల్టు వస్తుంది. హిందూ పేపర్లో వేస్తారు. ఆ పేపర్ కోసం 40-50 మంది పిల్లోల్లం అంతా కలిసి అర్ధరాత్రి రేణిగుంట రైల్వే స్టేషన్‌కి చేరుకున్నాం. రైల్లో పేపర్ రాగానే అందరం ఎగబడి రిజల్టు చూసుకున్నాం. అందరం పాసైనాము. చంద్రబాబు నంబరు లేదు. ఇంటికాడ నాయిన ఏమంటాడో అని భయం చుట్టుకునింది. ఒగడే రైల్వే స్టేషన్ నుంచీ నడుచుకుంటా వెళ్ళిపోతావుంటే నచ్చజెప్పినాము. మార్కుల లిస్టు వచ్చినాక చూద్దాం అందులో పాసై వుండచ్చు కదా అని ధైర్యం చెప్పి తిరుపతికి పిల్చకొచ్చినాము. మరసటి నాడు వాళ్ళ నాయన కోప్పడితే వాళ్ళమ్మ సర్దిచెప్పింది. అప్పట్లో పుత్తూరులో రాజులాయన జాతకం భలే చెప్పేవాడని పేరు. ఛార్జీలకు, ఖర్చులకు డబ్బిచ్చి వాళ్ళమ్మ మా ఇద్దరినీ పుత్తూరుకు పోయి జాతకం చూపిచ్చుకుని రమ్మని చెప్పింది. ఇద్దరం పుత్తూరుకు పోయినాం. రాజులాయన.. చంద్రబాబు చేయి కూడా చూడకుండా మొగం చూసి 'నీకు ఇంక తిరుగే లేదు... నువ్వు చాలా పైకి పోతావు పో...' అనేసినాడు. మళ్ళ వారం పది రోజులకు మార్కుల లిస్టులు వచ్చినాయి. వాటిలో చూస్తే చంద్రబాబు 52 శాతం మార్కులతో సెకండ్ క్లాసులో పాసైనాడు.

దశాంశాల్లో దిట్టలు





కళ్ళకు గంతలతో దశాంశాలు చెబుతున్న పునీత్ సాయి, రేవతి

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గణితంలో వచ్చే దశాంశాలను చెప్పడంలో బంగారుపాళ్య మండలం మంగళంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మరోసారి దిట్టలుగా నిరూపించుకున్నారు. చిత్తూరులోని విజయం ఎంబీఏ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం, పాపుదేశి ఫౌండేషన్,లయన్స్ క్లబ్ గోల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ప్రదర్శనను నిర్వహించాయి.కళ్ళకు గంతలు కట్టుకుని విద్యార్థులు దశాంశ స్థానాలు చెప్పడం ఆహూతులను అబ్బురపరిచింది. ఒకటి కంటే చిన్న సంఖ్యను సూచించడాన్ని పాయింట్ (.) ఉపయోగించే సంఖ్య రూపాన్ని దశాంశాలు అంటారు. 9వ తరగతి చదువుతున్న లహరి గణిత విలువల మొదటి దశాంశం నుంచి వెయ్యి దశాంశం వరకు



హేమ



లహరి

కేవలం 4.58 సెకండ్లలో చెప్పేశారు. టెన్త్ చదువుతున్న పునీత్ సాయి 1001 దశాంశం నుంచి 2000 దశాంశాలను 7.52 నిమిషాల్లో, హేమ 2001 నుంచి 3 వేల దశాంశాలను 8.12 నిమిషాల్లో, రేవతి 3 వేల నుంచి 3600 వరకు దశాంశలను 9.10 నిమిషాల్లో చెప్పి ఆకట్టుకున్నారు. మెంటార్‌గా గణిత అవధాని అరుణశివప్రసాద్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, లయన్స్ గోల్డ్ నగర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, విజయకుమార్, చంద్రమనాయుడు, జయంతి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు



ఆలయం వెలుపల క్యూలైన్లలో స్వామి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వరసిద్ధుడి ఉచిత దర్శనానికి మూడు గంటలకుపైగా సమయం పట్టింది. గుడ్ ఫ్రైడే సందర్భంగా సెలవు కావడంతో జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామి దర్శనార్థం కాణిపాకం విచ్చేశారు. రూ.150, రూ.100 క్యూలైన్లు పూర్తిగా నిండి పోయి వెలుపలకు వ్యాపించాయి. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ ఏఈవో రవీంద్రబాబు చర్యలు తీసుకున్నారు.

డీజే బాధ్యతల స్వీకరణ



డీజే అరుణ సారికను సన్మానిస్తున్న జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అరుణసారిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆమె చాంబర్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోపీనాథ్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, లక్ష్మీపతి, గణేష్, బాలసుందర్, రవీంద్రారెడ్డి, రాజేష్, హరికృష్ణ, ప్రభాకర్ రెడ్డి, సంతోష్, దిలీప్, యువరాజు, రెడ్డెప్ప, చంద్రశేఖర్, భ్రమరాంబ, పవనకుమారి, మినిమా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడితే శిక్ష తప్పదు

అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్

ఐరాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువులను వేటాడితే శిక్ష తప్పదని అటవీశాఖ డీఆర్వో రాకేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఐరాల మండల అటవీశాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. కోళ్లపల్లె పంచాయతీ, ఐరాల సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, సర్పంచులు కలిసి అడవి జంతువులను వేటాడే వారిపై కన్నేసి ఉంచాలని సూచించారు. అడవి జంతువులను వేటాడటానికి పొలాలకు కరెంటు తీగలు, ఉచ్చులు, నాటుబాంబులు పెట్టడం, విషప్రయోగం చేసినా, నాటు తుపాకులు కలిగి ఉన్నా శిక్షార్హులన్నారు. ఎవరైనా అడవి జంతువులను వేటాడితే బీట్ అధికారికి నెంబరు 94402 68691కు ఫోన్ చేయాలన్నారు. అదే సమయంలో ఎవ్వరూ అడవులకు నిప్పు పెట్టరాదని చెప్పారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తులు చేసుకోవాలని డ్వామా పీడీ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఐదువేల ఎకరాల్లో మామిడి, జామ, కొబ్బరి, దానిమ్మ, అల్ల నేరేడు, చింతకాయ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్ తదితర రకాలు సాగు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. రైతులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రౌడీషీటర్ దాడిలో మెకానిక్ మృతి



మహబూబ్ బాషా మృతదేహం

కుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రౌడీషీటర్ దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టడంతో మెకానిక్ మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. కుప్పం-గుడుపల్లె మార్గంలో శుక్రవారం మూర్తి అలియాస్ రెమో అనే రౌడీషీటర్ గుడుపల్లె వైపు నుంచి కుప్పం వైపు కారులో మితిమీరిన వేగంతో వస్తున్నాడు. అదే సమయంలో మహబూబ్ బాషా (56) అనే మెకానిక్ ద్విచక్రవాహనంలో అతడికి ఎదురుగా వెళ్తున్నాడు. మితిమీరిన వేగంతో వస్తున్న మూర్తిని నెమ్మదిగా వెళ్లాలని సూచిస్తూ చేతిని ఊపాడు. ఈ విషయంలో మూర్తి, మహబూబ్ బాషాల మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం తీవ్రమైన ఘర్షణకు దారి తీసింది. విపరీతమైన ఆగ్రహానికి గురైన మూర్తి, మహబూబ్ బాషాపై దాడి చేశాడు. ఆపస్మారక స్థితిలోకి వెళ్లిన మహబూబ్ బాషాను స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో ఆగ్రహానికి గురైన మృతుడి బంధువులు పీఈఎస్ ఆసుపత్రికి చేరుకుని ధర్నా చేశారు. వెంటనే రౌడీ షీటర్‌ను అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు వారికి సర్దిచెప్పారు. నిందితుడు మూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్బన్ సీఐ శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు గుంతల్లో జారిపడి అవ్వ, మనవడి మృతి



మునెమ్మ, జయప్రదీప్

గుడుపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పశువులను కడగడానికి వెళ్లిన అవ్వ మనవడు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందిన విషాద సంఘటన గుడుపల్లె మండలంలో చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు...బిజిగానిపల్లెకు చెందిన మకరందప్ప భార్య మునెమ్మ(62) తన మనవడు జయప్రదీప్(13)తో కలిసి శుక్రవారం ఉదయం పశువులను తోలుకుని సమీపంలోని గుట్టకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో పశువులను కడగడానికి సమీపంలోని నాగరబండ చెరువుకు జయప్రదీప్ తోలుకెళ్లాడు. చెరువులో ఉన్న గుంతలు పసిగట్టలేక జారి పడడంతో నీటిలో మునిగిపోతూ కేకలు వేశాడు.కట్టపై ఉన్న మునెమ్మ మనవడిని కాపాడడానికి నీటిలోకి వెళ్లింది.ఇద్దరూ పెద్ద గుంతలోని బురదలో ఇరుక్కుని బయటకు రాలేక మునిగిపోయి మృతి చెందారు. మధ్యాహ్నం 3 గంటలకు మునెమ్మ కుమారుడు చిరంజీవి వారిని వెతుక్కుంటూ నాగరబండకు రాగా పశువులు మాత్రమే కనించాయి.చెరువుకట్టపై అవ్వామనవళ్ల చెప్పులు, దుస్తులు కన్పించాయి.దీంతో మునెమ్మ, జయప్రదీప్ చెరువులో పడిపోయినట్లు భావించిన చిరంజీవి గ్రామస్తుల సాయంతో చెరువులో గాలించగా వారి మృతదేహాలు బయటపడ్డాయి.ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టు నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు.

మళ్లీ ఒంటరి ఏనుగు దాడులు

● గుడిసె, పంటల ధ్వంసం




టమోటా తోటలో గుడిసెను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు - ధ్వంసానికి గురైన టమోటా, కొయ్యలు

కల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై మళ్లీ ఒంటరి ఏనుగు దాడులు ప్రారంభమయ్యాయి. మండలంలో ఇటీవల నెల రోజుల నుంచి రెండు రోజుల క్రితం వరకు కమ్మపల్లి, దేవళంపేట, పాళెం, కల్లూరు పంచాయతీల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించింది. రెండు రోజులుగా అడవిలోనే తిష్ట వేసిన ఒంటరి ఏనుగు గురువారం రాత్రి టమోటా, మామిడి, డ్రిప్‌పైపులు తదితర పంటలను ధ్వంసం చేసింది. ముందుగా చింతలవంక నుంచి ఒంటరి ఏనుగు కమ్మపల్లి, దేవళంపేట పంచాయతీ మీదుగా పాళెం పంచాయతీలోకి అడుగుపెట్టింది. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌కు చెందిన టమోటా పంటను ఇష్టారాజ్యంగా ధ్వంసం చేసింది. అక్కడే ఏర్పాటు చేసిన గుడిసెను తోసేసింది. టమోటా తోటలోడ్రిప్ పైపులను తొక్కేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకొని టపాకాయలు పేల్చి శబ్దాలు చేయడంతో ఒంటరి ఏనుగు సిబ్బందిపై తిరగబడటంతో భయపడ్డారు. కొంతసేపటికి అక్కడ నుంచి పలువురు రైతుల మామిడిచెట్లను ధ్వంసం చేసుకుంటూ అడవిలోకి చేరుకున్నట్లు అటవీశాఖ ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు.

● మూలపల్లి వద్ద 12 ఏనుగుల గుంపు తిష్ట

పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లి వద్ద వారం క్రితం వరకు పంటలను ధ్వంసం చేసిన 12 ఏనుగుల గుంపు మండలం సరిహద్దులోని చంద్రగిరి మండలం మూలపల్లి సమీపంలోని అడవిలో ఉన్నట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు. 12 ఏనుగుల గుంపు ఏ సమయంలోనైనా మండలంలోకి ప్రవేశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అటవీప్రాంతం సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను కాపాడిన ట్రైనీ ఐపీఎస్



మెడికోతో ట్రైనీ ఐపీఎస్ హేమంత్

తిరుపతి(నేరవిభాగం)/రామచంద్రాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సమాచారం రావడం. సెల్‌ఫోను లొకేషన్ గుర్తించి సంఘటన స్థలానికి చేరుకోవడం. ఆత్మహత్యకు యత్నిస్తున్న మెడికోను కాపాడటం. ఇదంతా 15 నిమిషాల్లోనే జరిగిపోయింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నంద్యాలకు చెందిన ఓ మెడికో తిరుపతిలోని ఎస్వీయూ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధ పడుతున్నాడు. గురువారం తరగతులకు హాజరయ్యాడు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ.. రామచంద్రాపురం మండలం పీవీపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మామిడి తోటలో ఆత్మహత్య చేసుకుంటానని గురువారం రాత్రి తన స్నేహితులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు రామచంద్రాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామచంద్రాపురం సర్కిల్ వద్ద వాహనాల తనిఖీల్లో ఉన్న ట్రైనీ ఎస్పీ హేమంత్, సిబ్బంది రెండు బందాలుగా విడిపోయి మెడికో కోసం గాలించారు. ఆ సమయంలో అతడి మొబైల్ ఫోన్ నెట్ వర్కు పనిచేయలేదు. దీంతో మెడికో స్నేహితులకు ఫోన్ చేసి మెల్లగా అతడ్ని లైన్‌లోకి తీసుకున్నారు. అలా లొకేషన్ ట్రేస్ చేసి అతడిని గుర్తించారు. స్టేషన్‌కు తీసుకొచ్చి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై ఆరా తీశారు. అప్పటికే అతడు మానసిక ఒత్తిడిలో ఉండటంతో అలిపిరి పోలీసులకు అప్పగించారు. కౌన్సెలింగ్ కోసం రుయాలో చేర్పించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు ట్రైనీ ఎస్పీ చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తోటి స్నేహితులు, తల్లి తండ్రులకు, బంధువులతో పంచుకుంటే పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. ఇలా ఆవేశంతో ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకండని విజ్ఞప్తి చేశారు. అనంతరం అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. సకాలంలో స్పందించి మెడికోను కాప్పాడిన ట్రైనీ ఎస్పీ, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధరాజు అభినందించారు.

తిరుమలేశుడి సేవలో ప్రీతి జింటా



ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతిజింటా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె మూలమూర్తిని దర్శించుకోగా, ఆలయాధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

లాసెట్ దరఖాస్తుకు 27 వరకు గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్ దరఖాస్తుకు ఈనెల 27 చివరి తేదీగా నిర్ణయించారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ లాసెట్, ఏపీపీజీఎల్‌సెట్-2025-26 నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీ నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 27వ తేదీతో దరఖాస్తు ప్రక్రియ ముగియనున్నట్లు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.సీతాకుమారి తెలిపారు.

ఎందుకింత ఆలస్యం?

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగడంపై సీఈ ఆగ్రహం



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న రైల్వేశాఖ సీఈ మల్లికార్జున

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అమృత్‌భారత్ కింద చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు రూ.14కోట్లతో రెండేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ 50శాతం కూడా పూర్తి కాలేదు. ఈ పనులను శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజనీరు (సీఈ) మల్లికార్జున పరిశీలించారు. పనులు నత్తనడకన జరుగుతుండటంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ఎందుకింత ఆలస్యం జరుగుతోందని, రెండేళ్లవుతున్నా పూర్తిచేయక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటికి పనులు పూర్తి చేస్తారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల కోసం నూతనంగా నిర్మిస్తున్న గదులు చాలా చిన్నవిగా ఉన్నాయని, సిబ్బంది ఇబ్బంది పడతారని సీఈ దృష్టికి అధికారులు తీసుకొచ్చారు.

తిరుచానూరు ఆలయం వద్ద మంటలు

● అర్ధరాత్రి తప్పిన పెను ప్రమాదం



తిరుచానూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో శుక్రవారం రాత్రి మంటలు చెలరేగాయి. ఆలయంలోని పోటుకు ఫ్రైడే గార్డెన్ నుంచి పైపులైను ద్వారా నెయ్యి సరఫరా అవుతోంది. అన్న ప్రసాదాలు, లడ్డూ ట్రేలు శుభ్రం చేసిన తర్వాత మిగిలిన నెయ్యి వ్యర్థాలను ఆలయ 3వ గేటు (ఆస్థాన మండపం)వద్ద ఉన్న ఆటోస్టాండ్ సమీపంలోని డ్రైనేజీలో కలుస్తాయి. ఆ వ్యర్థాలు కలిసే చోట టీటీడీ ఎలాంటి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయలేదు. సరిగ్గా శుక్రవారం రాత్రి 11.15 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు నెయ్యి వ్యర్థాలు కలిసే చోట సిగరెట్ వెలిగించి పడేయడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో పక్కనే ఉన్న దుకాణం పాక్షికంగా కాలింది. చుట్టుపక్కల ఉన్న స్థానికులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. తమ వద్ద ఉన్న కార్బన్ డైఆక్సైడ్‌తో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన విజిలెన్స్ సిబ్బంది శివ గాయపడ్డారు. సకాలంలో ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. పొగ ఎక్కువగా రావడంతో ఆలయంలోకి మంటలు వ్యాపించాయేమోననే అనుమానంతో విజిలెన్స్, పోలీస్ సిబ్బంది పరుగులు తీశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాదరావు, సీఐ సునీల్‌కుమార్, పోలీసు, విజిలెన్స్ సిబ్బంది రాత్రి 12.15 గంటల వరకు అణువణువు పరిశీలిస్తున్నారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ సంఘటన చోటు చేసుకుందని, తిరిగి పునరావృతం కాకుండా ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వదిలించుకుందాం

గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ● నేటినుంచి నెలపాటు సేకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వ్యర్థాల) తొలగింపుపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయిన వీటివల్ల పర్యావరణ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతల్లోనూ ఇవి భారీగా పేరుకుపోతున్నాయి. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి నెల రోజులపాటు ఈ- వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనుంది.

పల్లెల నుంచి : బ్లాక్ అండ్ వైట్ టీవీలు, పనిచేయని డెస్క్‌టాప్ కంప్యూటర్లు, కీబోర్డులు, మౌస్‌లు, మానిటర్లు, మూగపోయిన ఫోన్లు, పాతకాలం ఏసీలు, రేడియోలు, తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువులను పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందజేయొచ్చు. ఇందుకోసం కియోస్క్ యంత్రాలను అందుబాటులోకి శనివారం నుంచి తెస్తున్నారు.

ఏం చేస్తారంటే..: గ్రామాల్లో సేకరించిన ఈ-వ్యర్థాలను పురపాలక సంఘాలకు తరలించి అక్కడున్న కేంద్రాలకు అప్పగిస్తారు. ప్రాణాంతక రసాయనాలు, ఖనిజాలను వేరు చేస్తారు. విలువైన లోహాలను వేరు చేస్తారు. అవసరమైన వాటిని ఉత్పాదక, పునర్వియోగం, పునరుత్పాక రంగాలకు తరలిస్తారు. ఈ- వ్యర్థాల సేకరణకు గుర్తింపు పొందిన కొన్ని కంపెనీల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చిస్తుంది.

మేనెలలో మూడో శనివారం వరకు..

ఈనెల 19వ తేదీనుంచి మేనెలలో మూడో శనివారం వరకు ఈ-వ్యర్థాలను సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని డీపీవో సుధాకర్‌రావు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇదే ఆదేశాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశామని చెప్పారు.

ఈ-చెక్ థీమ్‌తో నేడు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర': కలెక్టర్

ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ-చెక్ అనే థీమ్‌తో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పేరుకుపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి పునర్వినియోగం చేయడమే లక్ష్యమన్నారు. వీటిని సేకరించే బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంపై గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కల్పించి స్వచ్ఛ దివస్‌ను నిర్వహించాలన్నారు. వ్యర్థాలను తొలగించి.. వివరాలను 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

పీవీకేఎన్ కళాశాలలో నేడు జాబ్ మేళా

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి, సీడప్ (ఎస్ఈఈడీఏపీ), డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈజాబ్‌మేళా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారన్నారు. వెయ్యి ఉద్యోగాల కల్పన కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. టెన్త్ నుంచి డిగ్రీ పాస్/ఫెయిలైన 18-35 ఏళ్ల యువతీ యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 99854 42270, 85200 48041 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

21 నుంచి ఎస్వీయూలో పనివేళల మార్పు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత దృష్ట్యా ఎస్వీ యూనివర్సిటీలోని అన్ని కార్యాలయాలకు పనివేళలు మారుస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పనివేళలు ఉండేవి. దాన్ని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ మార్చారు. సోమవారం నుంచి మారిన పనివేళలు అమలు కానున్నాయి. మే 31వ తేదీ వరకు ఈ కొత్త విధానం అమలు కానుంది. ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

ఎట్టకేలకు గిరిజాపురంలో..
తాగునీటి బోరుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


తాగునీటి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజాపురంలో అధికారులు ఎట్టకేలకు తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'గిరిజాపురంలో తాగునీటి కష్టాలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. నెలరోజుల నుంచి మరమ్మతులకు గురైన తాగునీటి బోరును స్థానికుల సహకారంతో బోరులో నుంచి మోటారును వెలుపలికి తీసి మరమ్మతులకు పంపారు. బోరు మోటారు బాగు చేసే వరకు గ్రామస్తులకు ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి దొరబాబు పేర్కొన్నారు. దీంతో తాగునీటి సమస్య తాత్కాలికంగా తీరడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జలజీవన్ మిషన్ బృందం పర్యటన


గ్రామంలో పరిశీలిస్తున్న జలజీవన్ మిషన్ అధికారి అన్బళగన్

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో శుక్రవారం జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. జలజీవన్‌మిషన్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో కమిటీ సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో జలజీవన్, స్వచ్ఛభారత్ మిషన్ నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ అధికారి అన్బళగన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర, డీఈ స్టాలిన్, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఏఈఈ లోకనాథం, సర్పంచ్ వెంకటేష్, కార్యదర్శి సదాశివయ్య, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ బాలసుందరం, ఎమ్మార్సీలు సురేష్‌బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ప్రత్యేక నిఘా


క్యూఆర్ కోడ్ గోడ పత్రికలతో ఎస్‌ఐ

సోమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంజాయిపై ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహిస్తోందని ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఓ క్యూఆర్ కోడ్ ను అందజేసిందని, స్థానిక బస్టాండ్, కూడలి ప్రాంతాలు, జనసంచారం ఉన్న టీ దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ గోడపత్రికలను ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన సమాచారం వెంటనే పోలీసులకు చేరుతుందని ఆయన తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అలాగే కందూరు, పెద్దఉప్పరపల్లె, నంజంపేటలో క్యూఆర్ కోడ్ వినియోగంపై అవగాహన కల్పించారు.

కొత్తపేట యూనిట్ టీడీపీ సంస్థాగత ఎన్నికలు


కమిటీని సన్మానిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 11వ క్లస్టర్ కొత్త యూనిట్ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి సత్యేంద్ర శేఖర్, అబ్జర్వర్ చలపతిల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ విధివిధానాలు తెలియజేశారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌బాబు

రామకుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పల్లికుప్పం, పంద్యాలమడుగు, బందార్లపల్లె, గొరివిమాకులపల్లె పంచాయతీలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, టీడీపీ నేతలు గంట్లప్పగౌడు, కృష్ణానాయక్, చిన్నికృష్ణ, అనసూయ, రామ్మూర్తి, సీతాపతి, మనోహర్, కామరాజనాయక్, నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడిరెడ్డిపల్లె పంచాయతీ బత్తనపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీరాముని ఆలయంలో శుక్రవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు నిర్వహించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

సీఎస్ఐ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు


సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని సీఎస్ఐ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రాకేష్ నిమ్రోడ్ ప్రతిఒక్కరూ ప్రేమతో పొరుగు వారు కష్టంలో ఉంటే ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవికుమార్, భరత్ భూషణం, కమలకుమారి, కృపాకర్, మైత్రి, హేమలత, సుమిత్ర, సరళ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో ఎమ్మార్పీఎస్ సంబరాలు


పాలాభిషేకంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

పలమనేరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పలమనేరులోని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ల్యాట్ రాజు, పాండురంగయ్య, కృష్ణ, వెంకటాచలం, యువరాజు, పాపన్న, రామకృష్ణ, రత్నప్ప, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, ఆనంద్, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు తీర్థంలో కబడ్డీ పోటీలు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో ధనకొండ గంగమ్మ జాతర సందర్భంగా ఈనెల 20న ఆదివారం సాయంత్రం 4 గంటలకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు, నాలుగో బహుమతిగా రూ.5 వేలు, ఐదో బహుమతిగా రూ.2,516 నగదు బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ప్రవేశ రుసుం చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

రేపు చంద్రబాబు జన్మదిన వేడుకలు

పుంగనూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న సీఎం చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో జరిగే వేడుకలకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా గంగమాంబ ఆలయ గోపుర కలశ స్థాపన



రామకుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చింతకుప్పంలో వెలసిన గంగమాంబ ఆలయ గోపుర కలశ స్థాపన శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

కార్యకర్తల సంక్షేమమే చంద్రన్న ధ్యేయం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం కొలమడుగు, శివరామపురం, అబకలదొడ్డి, గుంజార్లపల్లె పంచాయతీ గ్రామ కమిటీ ఎన్నికలు మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో జరిగాయి. కుప్పం మున్సిపాలిటీ కౌన్సిలర్ జిమ్ దాము ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అబకలదొడ్డి పంచాయతీ పార్టీ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, గుంజార్లపల్లెకి మురుగేష్ రెడ్డిని అధ్యక్షులుగా, యూనిట్ ఇన్‌చార్జిగా ఆంజనేయరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబునాయుడు 2029 నాటికి అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని సంకల్పించారన్నారు. ప్రతి కార్యకర్తను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. పదవులు పొందే ప్రతిఒక్కరూ ప్రజా సేవకులుగా పనిచేసి పార్టీని బలపరచాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్షానికి ఒక్క సీటు రాకుండా పని చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకోవాలన్నారు. వర్గపోరు నుంచి బయటకు రావాలని.. అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ రెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామి, టీడీపీ సీనియర్ నేతలు ఉయ్యాల జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు భాస్కర్, ఆర్ఎస్ మణి, నారాయణస్వామి, పెద్దన్న, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్ర మండల తెలుగు యువత అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజు, దాము, గోవిందరాజులు, గోపాల్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల, ప్రధాన కార్యదర్శి రూప, హేమవతి, పౌలారాణి, పంచాయతీ పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుకుందాం..!

● సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన


పుంగనూరులో ముస్లిం నిరసన


సదుంలో ముస్లిం సోదరుల ర్యాలీ

పుంగనూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్క ముస్లిం ముందుకు రావాలని పుంగనూరు వక్ఫ్ రక్షణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పుంగనూరులో ముస్లిం సోదరులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఇందిరాసర్కిల్‌కు చేరుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ముస్లింలను ఇబ్బందులు పెట్టడానికే రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నట్లు ఆరోపించారు. పోరాటం చేస్తున్న నాయకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వక్ఫ్ రక్షణ కమిటీ సభ్యులు నూరుల్లా, ముజాహిద్, అయూబ్, అయాన్, రఫిక్, పర్వేజ్, జమీర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

● సదుం: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సదుం మండలంలోని ముస్లిం సోదరులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం స్థానిక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మతగురువులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రూ.65 లక్షల వ్యయం


ట్యాంకర్లకు నింపుతున్న నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీకి తాగునీటి కోసం రూ. 65 లక్షలు వ్యయం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. పలమనేరు మున్సిపాలిటీలోని ప్రజలకు తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం పలమనేరుకు 8 కిలోమీటర్ల దూరంలో కౌండిన్య నదిపై నిర్మించిన జలాశయం గత సంవత్సరం ఫిబ్రవరికే ఒట్టిపోయింది. దీంతో అప్పటి నుంచి అధికారులు ఉన్న బోర్ల నుంచి ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తూ వస్తున్నారు. అయితే వేసవి కారణంగా బోర్లలో నీటి మట్టం గణనీయంగా పడిపోవడంతో తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. దీంతో అధికారులు ప్రభుత్వానికి తాగునీటి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ నివేదికలు పంపారు. ఈ నేపథ్యంలో సాధారణ నిధుల నుంచి రూ. 30 లక్షలతో ఒక కొత్తబోరు వేయడంతో పాటు నీటి మట్టం తగ్గిపోయిన నాలుగు బోర్లను మరింత లోతు చేసేందుకు టెండర్లు పిలిచి ఈనెల 18న కొత్తబోరు వేయడంతోపాటు ఒట్టిపోయిన నాలుగు బోర్లను మరింత లోతు చేశారు. దీంతో వస్తున్న నీటిని ఆరు ట్యాంకర్లతో పలమనేరులోని నీటి శుద్ధి కేంద్రం సంపునకు శుక్రవారం నుంచి తరలించారు. అలాగే పలమనేరు, కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ప్రభుత్వం మున్సిపాలిటీకి కొత్తగా మరో 5 బోర్లు వేసేందుకు రూ.35 లక్షలు మంజూరు చేసింది. దీంతో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు.

దుస్థితిలో రొంపిచెర్ల బాలుర వసతిగృహం

● అవస్థలు పడుతున్న విద్యార్థులు


రొంపిచెర్ల వసతి భవనంలో పెచ్చులూడిన పైకప్పు


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

రొంపిచెర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల కేంద్రంలోని వసతి గృహం దుస్థితిలో ఉంది. గదుల పైకప్పు పెచ్చులూడుతోంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నా.. పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహంలో 92 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, స్నానపు గదులు మరమ్మతులకు గురికావడంతోపాటు అమర్చిన కొళాయిలు పాడైపోయాయి. దీంతో నీరు వృథాగా పోతోంది. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వసతి గృహాన్ని బాగు చేయాల్సిన అవసరం ఉంది.

అగ్గిపెట్టెల లారీ బోల్తా

● డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు


కుమ్మరమడుగు వద్ద బోల్తాపడిన అగ్గిపెట్టెల లారీ

వి.కోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వి.కోట-పలమనేరు ప్రధాన రహదారిలో కుమ్మరమడుగు వద్ద మలుపులో అగ్గిపెట్టెల లోడుతో వెళ్తున్న లారీ శుక్రవారం అదుపుతప్పి పాఠశాల ప్రహరీని ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా.. క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. వీరిని స్థానికులు 108 సాయంతో వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

యాదమరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మయ్యకండ్రిగకు చెందిన గోవిందరాజులు నాయుడు కోళ్ల ఫారాన్ని చిత్తూరుకు చెందిన గోవిందస్వామి.. లీజుకు తీసుకుని పందుల పెంపకం చేపట్టాడు. ఈ నేపథ్యంలో చిత్తూరులోని మిట్టూరుకు చెందిన పెరుమాళ్‌కు 11 పందులను అమ్మాడు. శుక్రవారం సాయంత్రం పెరుమాళ్, అతని కుమారుడు మణి (24) పందులను తీసుకెళ్లడానికి ఆటో తీసుకొచ్చారు. ఆటోలో ఎక్కించే క్రమంలో ఓ పంది తప్పించుకుంది. దాన్ని పట్టుకోవడానికి ఇనుపరాడ్డు తీసుకుని మణి వెంటబడ్డాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ పైనున్న విద్యుత్ తీగలకు ఇనుపరాడ్డు తగలడంతో చేయి భాగంలో కాలిపోయి స్పృహ కోల్పోయాడు. మణిని వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో చిత్తూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణసారిక, ఒంగోలు శాసన సభ్యుడు దామచర్ల జనార్దన్, రాష్ట్ర శిశు, చిన్న పిల్లల సంక్షేమ కమిషన్ కేసలి అప్పారావు ఉన్నారు. వేర్వేరుగా దర్శించుకున్న వీరిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్లు కోదండపాణి,వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి



బంగారుపాళ్యం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తుంబకుప్పం వీఆర్ఏగా పనిచేస్తున్న సుధాకర్ (59) మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, డీటీ బాబు, సిబ్బంది శుక్రవారం సుధాకర్ భౌతిక కాయానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లిలో కొలువైన కోదండరాముడి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గంగస్వీకరణ, కలశ స్థాపన, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. రాత్రి అర్చకుల వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా గ్రామానికి చెందిన భాస్కర్‌నాయుడు, పుష్ప దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.



● రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలం పెద్దకురవపల్లెలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు రమణ, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి శశికుమార్, ఉపాధ్యక్షుడు నాగరాజ, నాయకులు కిరణ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

విరూపాక్షి మారెమ్మకు..



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరుపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అగ్నికి దూరంగా ఉండటం ఉత్తమం


పుంగనూరులో....

కుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రమవుతున్న ఈ తరుణంలో అగ్నికి దూరంగా ఉండటం ఉత్తమమని కుప్పం అగ్నిమాపక కేంద్రం అధికారి డి.ప్రవీణ్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో 5వ రోజైన శుక్రవారం నాడు కుప్పంలోని ఖడే ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రిక్, ఆయిల్, గ్యాస్ మంటలు వంటి ప్రమాదాలు సంభవించినప్పుడు తమను తాము కాపాడుకునే పద్ధతులను గురించి తెలియజేశారు. సంబంధిత కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మోహన్, జయకుమార్, నరేశ్, కృష్ణయ్య, విజయ, సి.రఘుపతి, మణి, రఘుపతి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పలమనేరు: పలమనేరులో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెట్రోలు బంకుల వద్ద పనిచేసే సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలమనేరు అగ్నిమాపక అధికారి మనోగరన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

● పుంగనూరు రూరల్: పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు శుక్రవారం పుంగనూరులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెట్రోల్‌బంకు కార్మికులు, వాహనదారులు పాల్గొన్నారు.


కుప్పం: అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి ప్రవీణ్ కుమార్


పలమనేరులో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి మనోగరన్

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు


జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణసారికకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో చిత్తూరు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణసారిక, ఒంగోలు శాసన సభ్యుడు దామచర్ల జనార్దన్, రాష్ట్ర శిశుసంక్షేమ కమిషన్ కేసలి అప్పారావు ఉన్నారు. వేర్వేరుగా దర్శించుకున్న వీరిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పళ్లిపట్టు నుంచి చిత్తూరు వైపు వస్తున్న లారీ గురువారం రాత్రి పెద్ద తయ్యూరు వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న మరో లారీని ఢీకొంది. వాహనం ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలవలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఉద్యోగ విరమణ సన్మానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తుంబకుప్పం జడ్పీహెచ్‌ఎస్ గ్రేడ్-2 హెడ్మాస్టర్‌గా పలగాల పార్థసారథి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయన్ను శుక్రవారం సన్మానించారు. పాఠశాలలో ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రిట్టైర్డ్ డీవైఈవో వాసుదేవనాయుడు, ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడారు. పార్థసారథి 42 ఏళ్లపాటు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కంద పుష్కరిణిలో ఈతకెళ్లొద్దు: డీఎస్పీ

వెదురుకుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం స్కంద పుష్కరిణి లోతు ఎక్కువగా ఉంటుందని, ఎవరూ ఈతకెళ్లొద్దని నగరి డీఎస్పీ అజీజ్ హెచ్చరించారు. శుక్రవారం డీఎస్పీ ఆధ్వర్యంలో పుష్కరిణి వద్ద ఈ మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయనవెంట కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఉన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి


సుధాకర్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తుంబకుప్పం వీఆర్‌ఏగా పనిచేస్తున్న సుధాకర్ (59) మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, డీటీ బాబు, సిబ్బంది శుక్రవారం సుధాకర్ భౌతికకాయానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందించారు.

యాస్మిన్ హత్యకు కారకులను అరెస్టు చేయాలి

- బహుజన సేవ రాష్ట్ర అధ్యక్షుడి డిమాండ్


నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న చంద్రు

పూతలపట్టు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యాస్మిన్ హత్యకు కారకులను అరెస్టు చేయాలని బహుజన సేవ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పోటుకనుమలో సాయితేజను పరామర్శించి, మీడియాతో మాట్లాడారు. చిత్తూరు నంగపల్లెకు చెందిన యాస్మిన్‌ను సాయితేజ ప్రేమవివాహం చేసుకున్నారన్నారు. ఈ వివాహాన్ని యాస్మిన్ కుటుంబీకులు జీర్ణించుకోలేక పోయారని చెప్పారు. అందువల్లే తండ్రికి ఆరోగ్యం బాగాలేదని యాస్మిన్‌ను కారులో తీసుకెళ్లి హత్య చేశారని ఆరోపించారు. పోలీసులు సాయితేజ వద్ద ఫిర్యాదు తీసుకోకుండా యాస్మిన్ కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు విచారణ చేయడం బాధాకరమన్నారు. యాస్మిన్ కుటుంబీకులపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేసి, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. పీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.నాగరాజు, బహుజన సేవ ఫైనార్టీ నాయకులు నూరుల్లా, గోవిందయ్య, రూపక్ నాయక్, వెంకటేష్, శివశంకర్, తిమ్మరాయప్ప, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో నవ్యశ్రీ ప్రతిభ


నవ్యశ్రీకి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తున్న సినీ నటుడు సప్తగిరి

నగరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చెస్ పోటీల్లో నగరి మండల పరిధిలోని ముడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ ప్రతిభ చూపారు. తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ వారు తిరుపతిలో నిర్వహించిన ఓపెన్ రేటెడ్ చెస్ టోర్నమెంట్ అండర్-15 విభాగంలో ప్రథమస్థానం సాధించింది. దీంతో నవ్యశ్రీకి ప్రశంసాపత్రం, జ్ఞాపికను సినీ నటుడు సప్తగిరి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం మునికృష్ణ, చెస్ కోచ్ ఆనందమోహన్, టీచర్లు శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

సొంతమైన భూముల్లో కొబ్బరి మొక్కలు నాటారు!


కొబ్బరి మొక్కలు నాటుతున్న కుటుంబీకులతో పార్వతి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆగరమంగలం గ్రామానికి సమీపంలో దెందు కింద ఉన్న అంకాళ పరమేశ్వరుడికి నిర్వాహకులు వైసీపీ హయాంలో ఆక్రమించిన ఐదుగురు రైతుల భూములకు నాలుగు రోజుల కిందట విముక్తి లభించిన విషయం తెలిసిందే. ఈ భూముల్లో సంబంధిత రైతులు శంకరయ్యనాయుడు, ఆనందబాబు, చిట్టెమ్మ, భీమయ్య, పార్వతిలు తమ కుటుంబీకులతో కలిసి 350 కొబ్బరి మొక్కలు నాటి, సంతోషం వ్యక్తం చేశారు.

గంజి ప్రసాదం పంపిణీ

నగరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓంశక్తి ఆలయం వద్ద శుక్రవారం భక్తులకు నిర్వాహకుడు జ్యోతినాయుడు గంజిప్రసాదం పంపిణీ చేశారు. వేసవి ముగిసే వరకు రోజూ గంజి ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మణి మృతదేహం

యాదమరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మయ్యకండ్రిగకు చెందిన గోవిందరాజులు నాయుడు కోళ్లఫారాన్ని చిత్తూరుకు చెందిన గోవిందస్వామి.. లీజుకు తీసుకుని పందుల పెంపకం చేపట్టారు. ఈ నేపథ్యంలో చిత్తూరులోని మిట్టూరుకు చెందిన పెరుమాళ్‌కు 11 పందులను అమ్మాడు. శుక్రవారం సాయంత్రం పెరుమాళ్, అతని కుమారుడు మణి (24) పందులను తీసుకెళ్లడానికి వచ్చి ఆటోలో ఎక్కించే క్రమంలో ఓ పంది తప్పించుకుంది. దాన్ని పట్టుకోవడానికి ఇనుపరాడ్డు తీసుకుని మణి వెంటబడ్డాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ తీగలకు ఇనుపరాడ్డు తగలడంతో చేయి భాగంలో కాలిపోయి స్పృహ కోల్పోయాడు. మణిని వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు గ్రంథావిష్కరణ

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత గుడిపాటి అన్నయ్య నాయుడు రచించిన చిన్ని సూక్తి త్రిశతి గ్రంథావిష్కరణ ఆదివారం పీసీఆర్ హైస్కూల్‌లో జరగనున్నట్టు హరివిల్లు లలితకళా వేదిక సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రంథాన్ని ప్రముఖ వంశ సహస్రావధాని మేడసాని మోహన్ ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.




చిత్తూరు టౌన్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మేయర్ అముద - నగరంలో శిలువ మోస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు గుడ్ ఫ్రైడేని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిత్తూరు నగరంలోని టౌన్ చర్చిలో మేయర్ అముద ప్రార్థనల్లో పాల్గొన్నారు. పలమనేరు రోడ్డులోని క్యాథలిక్ చర్చిలోనూ ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవ విశ్వాసులు, ఏసుక్రీస్తు వేషధారుడు శిలువను మోస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. బీటీ కాంపౌండ్ చర్చితో పాటు ప్రశాంత్ నగర్, పీపుల్స్, గిరింపేట షెకీనా, చెన్నమ్మ గుడిపల్లె గోస్పెల్ చర్చిల్లోనూ క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం బేతేల్ ప్రార్థన చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ ఆశీర్వాదం, నిర్వాహకులు హరి, బాబు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ, పాలసముద్రం, వెంగళరాజకుప్పం, దీనబంధుపురం, అముదాల, బాలక్రిష్ణాపురం, తిరుమలరాజుపురం గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలో రోమన్ క్యాథలిక్ చర్చి, సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు, ఏసుక్రీస్తు వేషధారుడు శిలువను మోస్తూ ప్రదర్శన చేశారు. పాస్టర్లు రెవరెండ్ విజయశేఖర్ జయసింగ్, ప్రభు కుమారులు బోధన చేశారు. పలు గ్రామాల్లోని చర్చిల్లోనూ ప్రార్థనలు జరిగాయి. పాస్టర్లు యోహాన్,కిరణ్ బాబు, శామ్యూల్,మేరీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

నగరి: నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. నగరిలో ఉదయం ఏసుక్రీస్తు శిలువను మోసే ప్రదర్శనను క్రైస్తవులు నిర్వహించారు.



బంగారుపాళ్యం, నగరిలో శిలువను మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారులు

ట్రాఫిక్ సమస్య తీరేదెప్పుడో..?

- మార్కింగ్ చేసినా జరగని రోడ్డు విస్తరణ పనులు
- కార్వేటినగరంలో ఇబ్బంది పడుతున్న జనం

వెదురుకుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిలో ఈ పట్టణం ఉంది. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటోంది. అంతేకాకుండా ఎస్‌ఆర్‌పురం మండలం నెలవాయి వద్ద ఉన్న షుగర్ ఫ్యాక్టరీకి కార్వేటినగరం మీదుగా నవంబరు నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు క్రషింగ్ కోసం ట్రాక్టర్లు, లారీల్లో చెరకును నింపుకుని తీసుకెళ్తారు. వీటివల్ల మరిన్ని ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

అనధికార పార్కింగ్‌తో తిప్పలు: పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలతో కాకుండా దుకాణాల ముందు వాహనాలను బోర్డులతోపాటు అనధికార వాహనాల పార్కింగ్‌తోనూ ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.

పదేళ్ల కిందటే మార్కింగ్: పట్టణంలో రోడ్డు విస్తరణ కోసం పదేళ్ల కిందట మార్కింగ్ చేశారు. ఆ తర్వాత ఎందుకనో పట్టించుకోలేదు. ఆ తర్వాత కూడా మరిన్ని ఆక్రమణలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు.

ఈ ప్రభుత్వంపైనే ఆశలు: రోడ్డు విస్తరణ పనులు ఈ ప్రభుత్వంలోనైనా పూర్తవుతాయని స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వ విప్ వీఎం థామస్ చొరవ చూపి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


కార్వేటినగరంలో నిత్యం ఇదే పరిస్థితి

వారంలోపు ఆక్రమణలను తొలగించాలి: డీఎస్పీ


దుకాణదారులకు సూచనలిస్తున్న డీఎస్పీ అజీజ్

వెదురుకుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దుకాణాల ఆక్రమణలను వారంలోపు స్వచ్ఛందంగా తొలగించాలని కార్వేటినగరం దుకాణదారులను నగరి డీఎస్పీ అజీజ్ ఆదేశించారు. శుక్రవారం కార్వేటినగరం పోలీస్‌స్టేషన్‌లో సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ రాజ్ కుమార్‌తో కలిసి దుకాణదారులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. వ్యాపార సముదాయాల ముందు ఆక్రమణలు తొలగించాలన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

టపాసుల దుకాణాల తనిఖీ

కార్వేటినగరం పరిధిలోని టపాసుల దుకాణాలను డీఎస్పీ తనిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు.

ఎస్సీకి 'రెడ్డి' కులధ్రువీకరణ పత్రం జారీ?

- సాధికార సర్వేలో తప్పిదం వల్లేనన్న తహసీల్దార్

వెదురుకుప్పం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాంబేడు ఆదిఆంధ్రవాడ (ఏపీ డబ్ల్యూ)కు చెందిన కెరమేష్ కుమారుడు పృథ్వీచరణ్ తన కులధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తులో తాము ఎస్సీ(మాదిగ) కులానికి చెందిన వారమని పేర్కొన్నాడు. అయితే ఎస్సీకి బదులుగా 'రెడ్డి'-ఓసీ అని గత ఏడాది అక్టోబరు 15న తేదీన కుల ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. అప్పటినుంచి ఆకుటుంబం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంది. సమస్య మాత్రం పరిష్కారం కాలేదని వాపోతున్నారు. దీనిపై వెదురుకుప్పం తహసీల్దార్ బాబుని సంప్రదించగా, సాధికార సర్వేలో తప్పిదం వల్లే ఇలా జరిగి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం రివోక్ చేసే ఆప్షన్ ఉందని, తన దృష్టికి తీసుకొస్తే ఎస్సీ ధ్రువీకరణ పత్రం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తకన్నికలకు పూజలు


సప్తకన్నికలకు పూజలు చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బొమ్మసముద్రం క్రాస్ సమీపంలోని చిన సప్తకన్నికలకు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ పూజలకు ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు హాజరయ్యారు. ఆయన్ను మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్, మాజీ సర్పంచ్ అనసూయ, గ్రామస్తులు సత్కరించారు.

కార్యకర్తల సంక్షేమమే చంద్రన్న ధ్యేయం : కంచర్ల

శాంతిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం శాంతిపురం మండలంలోని కొలమడుగు, శివరామపురం, అలకుండిల్లి, గుంజార్లపల్లె పంచాయతీల్లో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబునాయుడు 2029 నాటికి అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని సంకల్పించారన్నారు. ప్రతి కార్యకర్తను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. పదవులు పొందే ప్రతిఒక్కరూ ప్రజా సేవకులుగా పనిచేసే పార్టీని బలపరచాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి పక్షానికి ఒక్క సీటు రాకుండా పని చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకోవాలన్నారు. పరిధిలోని సమస్యల నుంచి బయటకు రావాలని, అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ ఎంపీపీ నందం ఉదయకుమార్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మాజీ సెస్కో వైస్ చైర్మన్ చలపతిస్వామి, టీడీపీ సీనియర్ నేతలు ఉయ్యాల జయరామిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు టీడీపీ సభ్యత్వ కార్డు అందజేత



గుడిపాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారుగా ఉండి సర్పంచ్‌గా ఎన్నికైన గుణవతి టీడీపీలో రెండునెలల కిందట సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పుడు ఆమెకు సభ్యత్వ నమోదు కార్డు రావడంతో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ శుక్రవారం అందజేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



తవణంపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విజయకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఆయన్ను సన్మానించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, మాజీ ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, హెచ్‌ఎం దేవరాజులురెడ్డి, పుత్తూరు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరిపేటలో వినాయక ఆలయ నిర్మాణానికి రూ.10,000 విరాళాన్ని నటుడు యువ అందించారు. భగవంత్ కేసరి, ఓజీల-2 చిత్రంలో నటించిన యువ, తెలుగు నగరి గ్రామ అధిదేవత సామలమ్మకు పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


చిత్తూరులోని పెట్రోల్ బంక్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి పెద్దిరెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రీమ్స్‌పేటలోని క్వాలిటీ ఫ్యూయల్స్ పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పెనుమూరు మండలంలోని దొడ్డ డెయిరీలోనూ సిబ్బందికి వివరించారు. ఏడీఎఫ్‌ఓ కరుణాకర్, ఎల్ఎఫ్‌ఎం సురేష్, ఏసుపాదం, సిబ్బంది పాల్గొన్నారు.

నగరి: మండల పరిధిలోని నాగరాజకుప్పం మార్గంలో ఉన్న వైటెసోర్ ఇండస్ట్రీ వద్ద గ్యాస్ లీకేజీతో కలిగే మంటలను నివారించడంపై సిబ్బందికి, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నగరి ఫైర్‌స్టేషన్ ఎస్‌ఐ సుబ్బరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు స్మారకోపన్యాసం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభా గ్రాండ్ ఇన్ హోటల్‌లో శనివారం సాయంత్రం పోతన మహా భాగవత వైభవంపై ఆధ్యాత్మిక ఉపన్యాస కర్త జయరాం రెడ్డి స్మారకోపన్యాసం ఇస్తారు. ఈ మేరకు సంస్థ చైతన్య సాహితీ సంస్థ నిర్వాహకుడు రాఘవ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరివిల్లు లలిత కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై ముగ్గురిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బలరామ్ తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు నుంచి చిత్తూరు మీదుగా తమిళనాడు రాష్ట్రం రాణిపేటకు నాలుగు ఆవులు, ఆరు దూడలను అక్రమంగా తరలిస్తున్న రాణిపేటకు చెందిన ముషార్ అహ్మద్, బాబు, అబ్దుల్ రెహమాన్ లపై కేసు నమోదు చేశారు. ఆవులను పలమనేరులోని గోశాలకు తరలించారు.

అగ్గిపెట్టెల లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌కు గాయాలు


బోల్తాపడిన అగ్గిపెట్టెల లారీ

వి.కోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వి.కోట-పలమనేరు ప్రధాన రహదారిలో కుమ్మరమడుగు వద్ద మలుపులో అగ్గిపెట్టెల లోడుతో వెళ్తున్న లారీ శుక్రవారం అదుపుతప్పి పాఠశాల ప్రహరీని ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా.. క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. వీరిని స్థానికులు 108 సాయంతో వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ సోమశేఖరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జలజీవన్ మిషన్ బృందం పర్యటన


గ్రామంలో పరిశీలిస్తున్న జలజీవన్ మిషన్ అధికారి అన్నపూర్ణ

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో శుక్రవారం జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. జలజీవన్‌మిషన్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో కమిటీ సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో జలజీవన్, స్వచ్ఛభారత్ మిషన్ నేషనల్ వాష్ ఎక్స్‌పర్ట్ అధికారి అన్నపూర్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర, డీఈ షాలేమ్, ఎంపీడీఓ రాజేంద్రబాబు, ఏఈఈ లోకనాథం, సర్పంచ్ వెంకటేష్, కార్యదర్శి సదాశివయ్య, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ బాలసుందరం, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ

గంగవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పంచాయతీ ఐత్తననపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీరాముడి ఆలయంలో శుక్రవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. పూజల్లో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు.